ఈ రోజు విజయవాడ బాలోత్సవభవన్‌లో జరిగిన వామపక్ష పార్టీల ప్రెస్ కాన్ఫరెన్సు నోట్‌ను ప్రచురణార్థం పంపుతున్నాము.

విజయవాడ,
తేది : 19 ఏప్రిల్, 2022.

**మొదటి దోషి మోడీ**
**– మరో శ్రీలంకలా భారతదేశం**
**– 25న సచివాలయాల వద్ద నిరసనలు**
**– వామపక్షాల సమావేశంలో శ్రీనివాసరావు, రామకృష్ణ**

దేశంలో, రాష్ట్రంలో అన్ని వస్తువుల ధరలు పెరగడానికి నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్రప్రభుత్వం ప్రధాన దోషి అని వామపక్షాల సమావేశం అభిప్రాయం వ్యక్తం చేసింది. కేంద్రం తీసుకునే ప్రజావ్యతిరేక నిర్ణయాలను రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించకుండా, కేంద్రానికి సాగిలపడుతోందని వామపక్షాల నాయకులు ఆరోపించారు. కేంద్రానికి తోడు రాష్ట్ర ప్రభుత్వం కూడా అదనపు భారాలు మోపుతోందని వీటిని ప్రతిఘటించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. విజయవాడలోని బాలోత్సవభవన్‌లో వామపక్షాల సమావేశం ఎస్‌యుసిఐసి రాష్ట్ర ప్రధానకార్యదర్శి సుధీర్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. సమావేశం అనంతరం వామపక్ష నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో, దేశంలో ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని, ప్రజలు అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగాయని తెలిపారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, సిమెంట్, స్టీల్, ఇసుక, విద్యుత్, ఆర్టీసి ఛార్జీలు రోజుకొకటి చొప్పున ధరల భారాలు ప్రజలపై పిడుగుల వర్షంలా పడుతున్నాయన్నారు. కేంద్రం టోల్ చార్జీలు కూడా పెంచడంతో రవాణా వ్యవస్థ కుంగిపోతున్నదన్నారు. వీటిని ప్రజలు ప్రతిఘటిస్తేనే తగ్గే పరిస్థితి ఉందని తెలిపారు. తక్షణమే పెరిగిన ధరలన్నింటినీ తగ్గించాలని డిమాండ్ చేస్తూ నిరసనలు తెలపాలని కోరారు. గతంలో ఎన్నడూలేని విధంగా జాతీయస్థాయిలో 14శాతం ద్రవ్యోల్బణం పెరిగిందన్నారు. ధరల పెరుగుదలకు ఇది నిలువెత్తు నిదర్శనమన్నారు. 5 రాష్ట్రాల ఎన్నికలు ముగిశాక మోడీ బాదుడు మొదలైందని తెలిపారు. పెట్రోల్ లీటరు ధర రూ.121కి చేరిందని, సిమెంట్, స్టీల్, ఇసుక ధరలు పెరగడంతో పనులు లేక భవన నిర్మాణ, అనుబంధ రంగాల కార్మికులకు పనులు లేకుండా పోయాయన్నారు. భారతదేశం మరో శ్రీలంకలా మారనుందా అనే అనుమానం కలుగుతోందన్నారు. ధరలు తగ్గించాలనే డిమాండ్‌తో గ్రామ, వార్డు సచివాలయాల వద్ద 25న నిరసనలు తెలపాలని వామపక్షాలు నిర్ణయించాయని, ప్రజలంతా దీనిలో పార్టీలకు అతీతంగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. 25తర్వాత ధరల పెరుగుదలపై మిలిటెంట్ ఉద్యమానికి సంబంధించిన కార్యాచరణను మరో సమావేశం ద్వారా రూపొందిస్తామన్నారు. ధరలు తగ్గేవరకు ప్రతిఘటనలు కొనసాగుతాయని, పార్టీలకు అతీతంగా ప్రజలంతా నిరసనలు, ఆందోళనలు, రాస్తారోకోలు తదితర కార్యక్రమాల్లో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. డీజిల్ ధరలు పెరిగితే రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై తిరగబడకుండా, ఆ భారాన్ని ఛార్జీల రూపంలో ప్రజలపై వేయడం అన్యాయమన్నారు. స్టాలిన్, కేసీఆర్, పినరయి విజయన్ మాదిరిగా కేంద్రంపై పోరాడాలని, లేకుంటే ప్రభుత్వం కూడా భవిష్యత్తులో ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. ప్రభుత్వం వద్ద డబ్బులు లేక వివిధ కారణాలతో అమ్మఒడి, మత్స్యకార భరోసా తదితర సంక్షేమ కార్యక్రమాలకు కోత పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మత్స్యకార భరోసా పేరుతో ఇచ్చే వేట నిషేధ కాల భృతి మత్స్యకారుల హక్కు అని, దానికి కూడా వివిధ కారణాలతో కోత విధిస్తే వారు ఎలా బ్రతకాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వం ఈ విషయాలపై పునరాలోచించుకోకుంటే ప్రజాగ్రహానికి గురి కావాల్సి వస్తుందన్నారు. వామపక్షాలు చేపట్టే నిరసనలను జయప్రదం చేయాలని అన్ని

సంస్థలు, సంఘాలు, వ్యాపారస్తులు, చిరువ్యాపారులకు విజ్ఞప్తి చేశారు. ఆరుగురి మరణాలకు కారణమైన పోరస్ కంపెనీ యాజమాన్యంపై చర్యలు ఇంకా తీసుకోలేదని, తక్షణమే చర్యలు తీసుకోవాలని వామపక్షాల సమావేశం డిమాండ్ చేస్తోందన్నారు.

సిపిఐ రాష్ట్రకార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ దేశం, రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై వామపక్షాలు చర్చించాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆస్తిపన్నును 32శాతం పెంచిందని, 15శాతమే పెరుగుతాయని చెప్పిన మంత్రి బొత్స సత్యనారాయణ ప్రజలకు సమాధానం చెప్పాలని కోరారు. ప్రజలపై చెత్తపన్నులతో వైసిపి ప్రభుత్వం చెత్త పరిపాలన చేస్తోందని మండిపడ్డారు. 16రోజుల వ్యవధిలో 14సార్లు పెట్రోల్, డీజిల్ ధరలను మోడీ ప్రభుత్వం పెంచిందన్నారు. ధరలు తగ్గిస్తామనో, ఇతర చర్యలు ఏమైనా తీసుకుంటామనో కేంద్రం దీనిపై నోరు మెదపడం లేదన్నారు. భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేనంతగా ఎపిలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయని ప్రజలు చెబుతున్నారని పేర్కొన్నారు. ఆగష్టు 1 నుండి ట్రూఅప్ ఛార్జీలు పేరుతో రాష్ట్ర ప్రజలపై రూ.3వేల కోట్లు భారం రాష్ట్ర ప్రభుత్వం మోపబోతోందని తెలిపారు. కేంద్రం తెచ్చిన విద్యుత్ సంస్కరణలను రాష్ట్రంలో అమలు చేస్తున్నారని, దీనిలో భాగంగానే వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ మీటర్లు బిగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అదానీతో కుమ్మక్కై వేలకోట్ల భారాన్ని ప్రజలపై మోపుతోందన్నారు. ప్రజలపై భారాలు తగ్గించేంత వరకు ఉద్యమాలు ఆపే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. సమావేశంలో వై.వెంకటేశ్వరరావు(సిపిఎం), జల్లి విల్సన్, ముప్పాళ్ల నాగేశ్వరరావు (సిపిఐ), పి.ప్రసాద్, పోలారి, రవిచంద్ర (సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ), జాస్తి కిషోర్‌బాబు (సిపిఐ ఎంఎల్), పి.వి.సుందరరామరాజు (ఫార్వర్డ్‌బ్లాక్), బ్రహ్మయ్య (సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ), ఖాదర్‌బాషా (ఎంసిపిఐ(యు)) పాల్గొన్నారు. సమావేశంలో హాజరుకాని సిపిఐ ఎంఎల్ లిబరేషన్, ఆర్ఎస్‌పి నాయకులు సమావేశ నిర్ణయాలకు మద్దతు తెలిపారు.

= = = =